క్లుప్తంగా

సౌమ్య స్వరూప అలంకరణలో కన్యకాపరమేశ్వరి



తాడిపత్రి అర్బన్: జయంతి ఉత్సవాల్లో భాగంగా కన్యకాపరమేశ్వరీదేవి శుక్రవారం సౌమ్య రూప అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. వైశాఖ శుద్ధ అష్టమి రోజు ఆర్యవైశ్యులు తమ ఇష్టదైవమైన వాసవీ మాతకు విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం అనంతరం ఉదయం 10 గంటలకు లక్ష పుష్పార్చన చేపట్టారు. 11 గంటలకు అమ్మవారికి సామూహిక అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు మహా మంగళారతి నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటలకు వాసవీమాత సౌమ్య స్వరూప అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పునీతులయ్యారు.

అంగన్‌వాడీ ఆయాలకు మెమోలు



ఉదయం పది గంటలు దాటినా తెరవని అంగన్‌వాడీ కేంద్రం వద్ద సీడీపీఓ ఢిల్లీశ్వరి

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని ఏడుగురు అంగన్‌వాడీ ఆయాలకు శుక్రవారం సీడీపీఓ ఢిల్లీశ్వరి మెమోలు జారీ చేశారు. వివరాలు.. సీడీపీఓ తొమ్మిది అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఉదయం 10 గంటలైనా ఏడు కేంద్రాల తలుపులు తెరవలేదు. అందులో పని చేసే ఏడుగురు ఆయాలకు మెమోలు జారీ చేశారు. నిబంధనల మేరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలు తెరవాలి. అంగన్‌వాడీ కార్యకర్తలకు సెలవులు ఇచ్చారు. దీంతో ఆయాలే కేంద్రాలు తెరవాలి. కేంద్రాలు తెరవని ఏడుగురు ఆయాలకు సీడీపీఓ మెమోలు జారీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని కమాటం వీధి, సీఐ బంగ్లా, గాజుల బావి వీధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆమె కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం పౌష్టికాహారం నిల్వలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆయాలు పాల్గొన్నారు.

‘గురుకుల’ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని కొట్టాలపల్లి రోడ్డు సమీపాన ఉన్న ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రవేశానికి దరకాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హర్జే నాయక్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 3వ తరగతిలో 40 సీట్లు ఉన్నాయన్నారు. వీటిలో ఎస్టీ-32, ఎస్సీ-5, బీసీ-2, ఓసీ-1 సీటు ఉందన్నారు. అలాగే 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకూ ఉన్న బ్యాక్‌లాగ్ ఖాళీ సీట్లకు సైతం దరఖాస్తు చేసుకోవాలన్నారు. 4వ తరగతిలో -35 సీట్లు, 4వ తరగతిలో-24, 6వ తరగతి-15, 7వ తరగతి-4, 8వ తరగతి-14, 9వ తరగతి-8 సీట్లు ఉన్నాయన్నారు. బ్యాక్‌లాక్‌లో ఉన్న సీట్లు ఎస్టీ విద్యార్థులతో మాత్రమే భర్తీ చేస్తామన్నారు. వారిని లాటరీ పద్ధతిన ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9948100343 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

తాడిపత్రి అర్బన్: ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. వాసవీమాత జయంతి వేడుకల సందర్భంగా శుక్రవారం స్థానిక జైనీ పెద్దరంగయ్య కల్యాణమండపంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు శబరి వరప్రసాద్ ప్రారంభించారు. శిబిరంలో సుమారు 120 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు సురేంద్రనాథ్, ఉపాధ్యక్షుడు రాజా, యువజన సంఘం అధ్యక్షుడు పెండేకంటి అవినాష్, కార్యదర్శి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

జేసీకి మరోసారి భంగపాటు తప్పదా?

- పెరిగిన మహిళా ఓటింగ్
- విజయంపై వైఎస్సార్‌సీపీ శ్రేణుల ధీమా
- నైరాశ్యంలో టీడీపీ మద్దతుదారులు



తాడిపత్రిలో బారులు తీరిన మహిళా ఓటర్లు (ఫైల్)

తాడిపత్రిరూరల్: ఎన్నికల్లో జేసీ ప్రభాకర్‌రెడ్డికి మరోసారి భంగపాటు తప్పదని తెలుస్తోంది. పోలింగ్‌కు ముందు రోజు వరకూ టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి విజయంపై ఎంతో ధీమా వ్యక్తం చేసిన ఆయనకు ప్రజలు ఓటు ద్వారా మరోసారి వ్యతిరేకత వ్యక్తం చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. పోలింగ్ శాతం భారీగా పెరగడం.. అందులోనూ మహిళల ఓటింగ్ ఎక్కువగా ఉండటంతో జేసీకి ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఏర్పడింది. తనకు వ్యతిరేకంగా మారిన పోలింగ్ శాతాన్ని తగ్గించేందుకే ఎన్నికల రోజు పట్టణంలోని ఓంశాంతి నగర్‌లో అల్లర్లకు తెరలేపినట్లు తెలుస్తోంది. గత సోమవారం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై అనుచరులతో రాళ్ల దాడి చేయించడమే కాక ఆయనతోపాటు ఇతరుల వాహనాలను ధ్వంసం చేయించారు. టైలర్స్ కాలనీలో మరోసారి ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై రాళ్ల దాడికి జేసీ మద్దతుదారులు ప్రయత్నించారు. ట్రాక్టర్‌లో రాళ్లు తీసుకెళుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అల్లర్లతో తాడిపత్రి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ఓటింగ్‌కు రాకుండా చేయాలన్న దురాలోచన చేశారు. జేసీ ఆలోచనలను పటాపంచలు చేస్తూ ఓటర్లు తండోపతండాలుగా తరలి వచ్చి పోలింగ్‌లో పాల్గొన్నారు.

2019 కంటే పెరిగిన పోలింగ్ శాతం

తాడిపత్రి నియోజక వర్గంలో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. 2019లో 79.06 శాతం పోలింగ్ కాగా 2024 ఎన్నికల్లో 83.08 శాతం నమోదైంది. మొత్తం 2,48,880 ఓటర్లకు గాను 2,06,701 మంది ఓటు వేశారు. వారిలో పురుషులు 1,02,898 మంది, 1,.03,790 మహిళలున్నారు.

తప్పిన జేసీ లెక్క

ఈ ఎన్నికల్లో జేసీ ప్రభాకర్‌రెడ్డి లెక్క తప్పింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు శాతం ఎక్కువ ఉంటుందని ఆయన భావించారు. టీడీపీ మేనిఫెస్టో ఓటర్లను తనవైపు తిప్పుతుందనుకున్నారు. పోలింగ్ ప్రారంభంలో ఎక్కడ చూసినా భారీగా ఓటర్ల క్యూ ఉండటంతో అందులో ఎక్కువ శాతం మంది మహిళలు ఉండటంతో మేనిఫెస్టోలోని పథకాలకు ఆకర్షితులై టీడీపీకి ఓట్లు వేసేందుకు వచ్చారని పప్పులో కాలు వేశారు. కానీ పోలింగ్ కేంద్రాల్లో కూర్చొన్న ఏజెంట్ల సమాచారంతో ఖంగుతిన్నారు. ఓటింగ్‌కు వచ్చిన వారిలో అత్యధికులు వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేస్తున్నారని తెలియడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. క్యూలో వున్న మహిళా ఓటర్లు ‘సీఎం జగన్ సంక్షేమ పథకాలతో ఎంతో లబ్ధి పొందామని, అందుకు కృతజ్ఞతగా వైఎస్సార్‌సీపీకి ఓటు వేయడానికి వచ్చాం. మీరు కూడా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలి’ అంటూ అభ్యర్థించడం స్టాండింగ్‌లో వున్న టీడీపీ పోలింగ్ ఏజెంట్లకు దిమ్మతిరిగింది. బహిరంగంగా ఓటర్లు పరస్పరం చెప్పుకుంటూ కనిపించడం గురించి జేసీకి సమచారం చేరవేశారు. ఇలా అయితే గెలవడం కష్టమన్న దుష్ట ఆలోచనతో పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లడానికి ఎలాంటి అనుమతి లేకపోయినా అడిషన్ ఎస్పీ రామక్రిష్ణ సహకారంతో వెళ్లి ఓటింగ్ శాతాన్ని తగ్గించేందుకు అల్లర్లకు తెరలేపారు.

నియోజకవర్గంలో పోలింగ్ ఇలా..					
మండలం	మొత్తం ఓట్లు	పోలైనవి	పురుషులు	మహిళలు	ఇతరులు
తాడిపత్రి పట్టణం	87,090	66,844	32,461	34,374	9
పెద్దవడుగూరు	37,582	33,699	16513	17186	-
యాడికి	45,583	37,881	19024	18,856	1
పెద్దపప్పూరు	28,115	25409	12,983	12,424	2
తాడిపత్రి	50,510	42,868	21,244	21623	1

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను కొన్నా ఫలితం సున్నా

ప్రతి ఎన్నికలోనూ జేసీ కుటుంబానికి తాడిపత్రి పట్టణం అండగా ఉంటోంది. మండలాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని అడ్డుకుని విజయం సాధించాలంటే తాడిపత్రి పట్టణంలో ఎక్కువ ఓట్లను సాధించాలన్న కుట్ర పూరిత ఆలోచనతో ఆ పార్టీ నాయకులకు ఎర వేశారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దారెడ్డిని మానసికంగా దెబ్బతీయడానికి, పార్టీకి వున్న ఓట్లను చీల్చడానికి పన్నిన వ్యూహం బెడిసి కొట్టింది. కొందరిని రూ.లక్షలు పోసి కొనుగోలు చేయగా మరి కొందరికి పలు రకాల ఆశలు పెట్టడమే కాక టీడీపీని అడ్డుపెట్టి ఆ పార్టీ అధినేత సామాజిక వర్గాన్ని తమ వైపు తిప్పుకున్నాడు. మరి కొందరిని బంధుత్వాలను ఆసరా చేసుకొని బుట్టలో వేసుకున్నాడు. వీరంతా వైఎస్సార్‌సీపీకి బరువుగా మారడమే కాక అసాంఘిక కార్యకలాలకు తావివ్వడంతో పార్టీకి ప్రజల్లో చెడ్డ పేరు రాకుండా ఉండేందుకు.. వారిని ఏడాది కాలంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి దూరం పెడుతూ వచ్చారు. వారిని పార్టీలోకి చేర్చుకున్న జేసీకి తరువాత అర్థమైంది ఏంటంటే.. వారి వల్ల పార్టీకి లాభం కంటే నష్టమే ఎక్కువని, వారి ఆధిపత్యంలో ఉన్న వార్డుల్లో ఎక్కువ శాతం మంది ఓటర్లు వైఎస్సార్‌సీపీకి జై కొట్టడం ఖంగుతినేటట్లు చేసింది. 2021లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో ఇలాంటి వారి వల్ల గెలవాల్సిన కౌన్సిలర్ల అభ్యర్థులు ఓడిపోయారు. ప్రధానంగా పట్టణంలోని టైలర్స్ కాలనీలో అత్యధికులు ముస్లింలు, కూలీలు ఉన్నారు. తప్పనిసరిగా మూడు వార్డుల్లో గెలుస్తామనుకున్న అంచనాలు తప్పడానికి స్థానిక నాయకుని వెన్నుపోటు రాజకీయాలేనని ఎన్నికల అనంతరం తెలియడంతో ఎమ్మెల్యే పెద్దారెడ్డి పక్కన పెట్టారు. ప్రస్తుతం ఆ నాయకుడు టీడీపీలోకి వెళ్లడంతో బలం పెరిగిందని జేసీ భావించారు. కానీ అర్ధరాత్రి వరకు పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్లు వైఎస్సార్‌సీపీకి జై కొట్టారని తెలియడంతో జేసీకి దిమ్మతిరిగింది. పట్టణంలోని పాతకోటలో మున్సిపల్ ఎన్నికలకు ముందు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన నాయకుడు ఆ ఎన్నికల్లో రెండు వార్డుల్లో తన ప్రతిభతో అభ్యర్థులను గెలిపించానని చంకలు గుద్దుకున్నాడు. అతనిది వాపు కాదు.. బలుపని జేసీ తప్పుగా అంచనా వేసి రూ.లక్షలు పోసి అతదితోపాటు ఇద్దరు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను కొనుగోలు చేశాడు. కానీ అక్కడ అత్యధికులు కూలీలు ఉండడంతో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపినట్లు తెసుస్తోంది.. గతంలో జేసీ చేసిన దురాగతాలకు మనస్తాపానికి గురైన వైశ్యులు ఎమ్మెల్యే పెద్దారెడ్డికి జై కొట్టారని వారి మాటల వల్ల అర్థమవుతోంది. పట్టణంలో మిగిలిన ప్రాంతాల్లో ఇంచుమించు ఇదే పరిస్థితి కనపడటం జేసీకి మింగుడు పడని పరిస్థితి.

వైఎస్సార్‌సీపీకి అండగా గ్రామీణ ఓటర్లు

ఎన్నికలకు ముందు జేసీ ప్రభాకర్‌రెడ్డి అంచనాలకు గ్రామీణ ఓటర్లు చెక్ పెట్టారని తెలుస్తోంది. మండలాల్లో వైఎస్సార్‌సీపీ ఓటింగ్ శాతాన్ని గణనీయంగా తగ్గించేందుకు జేసీ తాడిపత్రి పట్టణంలో నాయకులకు వేసిన వల సక్సెస్ కావడంతో మండలాలపై దృష్టి పెట్టాడు. వివిధ కారణాలతో పార్టీలో చురుకుగా లేని నాయకులకు పలు రకాల ప్రలోభాలకు గురి చేసి టీడీపీలోకి చేర్చుకునేందుకు గాలం వేశాడు. యాడికి, పెద్దవడుగూరు, తాడిపత్రి మండలాల్లోని నాయకులకు గాలం వేయడానికి ప్రయత్నించినా జేసీ గురించి ఎరిగిన వారు కావడంతో ప్రతిపాదలను సున్నితంగా తిరస్కరించి వైఎస్సార్‌సీపీలోనే ఉంటామని ముఖం పైనే చెప్పారు. పెద్దపప్పూరు మండలంలో మాత్రం బంధుత్వం ఎర చూపి సక్సెస్ అయినా ఆ నాయకుడిని, జేసీని తిరస్కరిస్తూ ఓటర్లు పోలింగ్‌లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచినట్లు రాజకీయ మేధావులు భావిస్తున్నారు.

బ్రాహ్మణపల్లిలో ‘జగనన్న ఆరోగ్య సురక్ష’

తాడిపత్రిటౌన్: మండలంలోని బ్రాహ్మణపల్లిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు లావణ్య 401 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు రోజూ తేలికపాటి వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మహేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు నాణ్యతగా ఉండాలి

యల్లనూరు: ఉపాధి హామీ పనుల్లో నాణ్యత ఉండాలని ఎంపీడీఓ వీరరాజు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో కూలీలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలన్నారు. అన్ని పంచాయతీల్లో పనులు పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లు, టీఏలు ప్రతాప్,శంకర్, అదిల్, జయరాం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎంఈఓగా నవిధ



బుక్కరాయసముద్రం: మండల విద్యాధికారిగా నవిధ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంఈఓ-1గా పనిచేస్తున్న గురుప్రసాద్ ఇటీవల పదవీ విరమణ చేశారు. అనంతపురం నగరంలోని నెంబర్-2 పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న నవిధ బీకేఎస్ ఎంఈఓ-1 (ఎఫ్ఏసీ) గా బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ఎంఈఓ-2 లింగా నాయక్‌తో సమన్వయంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. త్వరలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారం, అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు

తాడిపత్రి అర్బన్: 2024-2025 సంవత్సరానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు కళాశాలలో సైన్స్, ఆర్ట్స్, ఒకేషనల్ గ్రూపులున్నాయన్నారు. ఇంటర్, ఒకేషనల్ కోర్సులో చేరే విద్యార్థులకు కళాశాలలో ఉయదం 10 గంటల నుంచి దరఖాస్తులు అందజేస్తున్నామన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలీసుల అష్ట దిగ్బంధంలో ఎమ్మెల్యే నివాసం



ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటి వద్ద ఏర్పాటుచేసిన బారికేడ్లు

తాడిపత్రిరూరల్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో ఉన్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి నివాసాన్ని పోలీసులు అష్ట దిగ్బంధం చేశారు. ఎన్నికల అల్లర్ల అనంతరం ఎమ్మెల్యే నివాసాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే ఇంటికి వెళ్లే నాలుగు వైపుల రహదారులను బారికేడ్లు వేసి పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. సాయుధులైన పోలీసుల పహారా నిఘాలో ఉంటోంది. కేవలం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను మాత్రమే ఇంటి వద్దకు పంపుతున్నారు. ఎమ్మెల్యే ఇంటి పరిసర నివాసాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.

రెండు గ్రామాల్లో చెక్‌పోస్టులు

యల్లనూరు: మండలంలోని కూచివారిపల్లి, గిర్రమ్మబావి గ్రామాల్లో పోలీసులు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఇటీవల తాడిపత్రిలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకుల మధ్య జరిగిన గొడవల కారణంగా జిల్లా ఉన్నతాధికారులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. రోజూ ఎవరు వస్తున్నారు .....ఎవ్వరు పోతున్నారనేది పోలీసులు నిఘా పెట్టారు. జనాలు గొడవల్లో పాల్గొనకుండా చెక్ పెట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

తాడిపత్రి వెళ్లకుండా పోలీసుల చర్యలు

గుత్తి: గుత్తి నుంచి వైఎస్సార్‌సీపీ , టీడీపీ నాయకులు, కార్యకర్తలు తాడిపత్రికి వెళ్లకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. తాడిపత్రిలో జరిగిన హింసాయుత ఘటనలు పునరావృతం కాకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎవ్వరూ తాడిపత్రి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్సై నబీసూల్, సిబ్బంది అనంతపురం రోడ్డు, తాడిపత్రి రోడ్డులో గస్తీ నిర్వహించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం



వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గ్రామస్తులు శుక్రవారం ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి విగ్రహాన్ని శోభాయానంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంరతం ట్రాక్టర్‌పై స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు.

నేడు కల్యాణోత్సవం

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ఆరాధన ఉత్సవాలు గ్రామస్తులు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు పతాక ఆవిష్కరణ, గణపతి పూజ, నవగ్రహాల పూజ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శనివారం తెల్లవారుజాము 5 గంటలకు వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహించునున్నారు.

టీడీపీ నాయకుల నుంచి రక్షణ కల్పించండి

గుంతకల్లు: టీడీపీ నాయకుల నుంచి తనతో పాటు కుటుంబసభ్యులకు ప్రాణహాని ఉందని బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయ్‌కిరణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై తాను ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని మనుస్సులో పెట్టుకున్న గుమ్మనూరు జయరాం వర్గాలు తన అంతు చూస్తాం అంటూ హెచ్చరిస్తున్నారన్నారు. తనకు రక్షణ కల్పించాలని ఎన్నికల సంఘానికి లేఖ రాశానన్నారు.

ఉరుములు, మెరుపులతో తాడిపత్రిలో వర్షం



వర్షపు నీటితో జలమయమైన క్రిష్ణాపురం జీరో రోడ్డు

తాడిపత్రిరూరల్: పట్టణంలో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దాదాపు మూడు గంటల పాటు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలోని హరిజనవాడ, పుట్లూరురోడ్డు, క్రిష్ణాపురం జీరో రోడ్డు, నందలపాడు, శ్రీనివాసపురం, గన్నెవారిపల్లి కాలనీ, సీపీఐ కాలనీ, నంద్యాల రోడ్డు తదితర చోట్ల ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. అలాగే వర్షం వల్ల విద్యుత్‌కు అంతరాయం కలగడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. అయితే పగలంతా ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షం, చల్లని గాలితో ఉపశమనం పొందారు. అదే విధంగా ఖరీఫ్‌కు ఈ వర్షం అనుకూలం కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

నాణ్యమైన విత్తన వేరుశనగ పంపిణీ చేస్తాం



గార్లదిన్నెలో సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను పరిశీలిస్తున్న ఏడీ రవి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని ఆర్బీకేల్లో రైతులకు నాణ్యమైన సబ్సిడీ కే6 విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ, అనంతపురం ఏడీ రవి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్బీకేలో సబ్సిడీ వేరుశనగ కాయల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ సబ్సిడీ వేరుశనగ కావాల్సిన రైతులు శనివారం నుంచి అన్ని ఆర్బీకేల్లోని సిబ్బందిని సంప్రదించాలన్నారు. గార్లదిన్నె మండలానికి 1,400 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించామన్నారు. వేరుశనగ విత్తన కాయలు ఒక క్వింటా పూర్తి ధర రూ.9,500 కాగా, సబ్సిడీ రూ. 3,800 ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ సోమశేఖర్, ఏఈఓ ప్రవంతి, వీహెచ్ఏ గల్ఫరేష, రాధాక్రిష్ణ, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ధర్నా

పుట్లూరు: మండలంలోని కందికాపుల గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహిళలు ధర్నా చేశారు. మూడు రోజులుగా నీరు సరఫరా కాలేదన్నారు. సమస్య పరిష్కరించాలని వారు కోరారు.

వ్యక్తి అదృశ్యం



రామాంజనేయులు

పుట్లూరు: మండలంలోని నారాయణపల్లికి చెందిన జెండా రామాంజనేయులు అనే వ్యక్తి అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఈ నెల 2న చెన్నైలో పని ఉందని వెళ్లిన భర్త ఇంటికి రాలేదని, అతడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేటి నుంచి విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ఆర్‌బీకేల్లో విత్తన వేరుశనగ కోసం శనివారం నుంచి రిజిస్ట్రేషన్ పక్రియ చేపట్టామని ఏఓ మహితాకిరణ్ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం 40 శాతం రాయితీతో రైతులకు వేరుశనగ విత్తనకాయలు అందజేస్తుందన్నారు. రాయితీ పోను రైతులు 30 కేజీల బ్యాగుకు రూ.1,710 చెల్లించాలన్నారు. అర ఎకరా ఉన్న రైతుకు ఒక బ్యాగు, ఎకరా వున్న రైతుకు రెండు బ్యాగులు, ఎకరా పైగా ఉన్న రైతులకు 3 బ్యాగుల వేరుశనగ అందజేస్తామన్నారు.

పుట్లూరు: రైతు భరోసా కేంద్రాల్లో శనివారం నుంచి విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ పక్రియ ప్రారంభించనున్నట్లు ఏఓ కాత్యాయని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలానికి కే-6 రకం 100 క్వింటాళ్ల విత్తన వేరుశనగ వచ్చిందన్నారు. 30 కిలోల వేరుశనగ బస్తా ధర రూ.2850 కాగా 40శాతం సబ్సిడీ రూ.1,140 పోనూ రైతు వాటా రూ.1710 చెల్లించాలన్నారు.

శింగనమల: మండంలోని 13 రైతు భరోసా కేంద్రాల్లో శనివారం నుంచి విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తామని ఏఓ అన్వేష్‌కుమార్ తెలిపారు. మండలానికి 1800 క్వింటాళ్ల కే6 రకం, 100 క్వింటాళ్ల కేఎల్-1812 రకం, 100 క్వింటాళ్లు టీసీజీఎస్-1694 రకం కేటాయించారన్నారు.

24 నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

బుక్కరాయసముద్రం: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే రైతులకు ఈ నెల 24వ తేదీ నుంచి విత్తన వేరుశనగ చేయనున్నట్లు ఏఓ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. మండలానికి 2,200 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించామన్నారు. ఇప్పటికే 300 క్వింటాళ్ల వేరుశనగ రైతు భరోసా కేంద్రాలకు వచ్చిందన్నారు. రైతులు సమీపంలోని ఆర్బీకేల్లో శనివారం నుంచి విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ



విరుపాపురం వద్ద పొలంలో ట్రాక్టర్‌తో సేద్యం చేస్తున్న రైతు



పెద్దవడుగూరులో పత్తి కట్టెను తొలగించి కాలుస్తున్న దృశ్యం



పొలాలకు తోలుకున్న సేంద్రియ ఎరువు

పెద్దవడుగూరు: ఖరీఫ్ పంటలు సాగు చేయడం కోసం రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. కొందరు పంట పొలాలను శుభ్రం చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. పొలాల్లో ఉన్న పత్తి కట్టెను, కంప చెట్లను తొలగించడంతో పాటు వేసవి దుక్కులు చేసుకుంటున్నారు. మరి కొందరు పొలాలను సారవంతంగా మార్చుకోవడం కోసం సేంద్రియ ఎరువులు తోలుకుంటున్నారు. మండలంలో 25 పంచాయతీలుండగా చాలా పంచాయతీల్లో వేరుశనగ పంట సాగు చేస్తారు. మరి కొన్ని గ్రామాల్లో పత్తి పంట సాగు చేస్తారు. మరి కొందరు మిరప పంటను సాగు చేసే ఆలోచనల్లో ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

గుంతకల్లు: రైల్వేలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ జాతీయ అధ్యక్షుడు భైరవకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జైపూర్ నుంచి మైసూరుకు రైలులో వెళ్తున్న ఆయన గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో కాసేపు దిగారు. దీంతో ఆయన్ను గుంతకల్లు డివిజన్ ఎస్సీ. ఎస్టీ అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గుంతకల్లు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సాయిబాబా, ఎం.మురళి తదితరులు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 2004 కంటే ముందే వివిధ కారణాలతో మృతిచెందిన ఉద్యోగి కుటుంబసభ్యులకు సకాలంలో ఉద్యోగం కేటాయించకపోవడంతో 2005లో ఉద్యోగాలు భర్తీ చేశారు. 2004 తరువాత ఉద్యోగం పొందిన వీరికి పాత పెన్షన్ విధానం వర్తించదు. వారు నష్టపోకుండా పాత పెన్షన్ విధానం వర్తించేలా చూడాలన్నారు. అలాగే ఎస్సీ. ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లు, బదిలీలు తదితర విషయాల్లో రోస్టర్ పద్ధతి అమలు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి జీఎస్ కిషోర్‌కుమార్, నాయకులు శ్రీనివాసులు, తిక్కస్వామి, ఓబుళపతి, రాముడునాయక్, ఆదినారాయణ, జీఎంవీ రమణ, జీవీ రమణయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.